
పెద్దకథ

# శారద నిర్ణయం

'అన్నపూర్ణ'



అది ఒక జిల్లాకు ముఖ్య పట్టణం. ఆ పట్టణానికి దక్షిణ పార్శ్వంలో ఉంది శ్రీనివాసనగరు. ధనవంతుల పేట అనేది దాని మరో పేరు. అక్కడ అధునాతన భవంతులతో పాటు పాతకాలం నాటి ఇళ్ళూ కొన్ని వున్నయ్. వాటిని వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు. అలా లెక్కించ దగిన వాటిల్లోదే సోమశేఖరంగారి యిల్లు...... ఆయన తండ్రి హయాంలో గాములు దాన్ని కట్టించారు.

చేసే గుమాస్తా ఉద్యోగంనుంచి రిటైర్‌మెంట్ పుచ్చుకున్నారు ఈ మధ్యనే. పెన్షన్ రూపంలో వచ్చేకొద్దిమొత్తం చాలక కుటుంబ పోషణార్థం ఓ ప్రైవేట్ ఫరంలో తిరిగి గుమాస్తాగా కుదిరాడు.

ఉదయం తొమ్మిది గంటలకు భోజనం చేసివెళ్ళిన సోమశేఖరం తిరిగి ఇంటికి వచ్చేది రాత్రి తొమ్మిది గంటలకే.

అప్పుడు కూతురు శారద అభిమానంతో తోడి యిచ్చిన నీళ్ళతో స్నానంచేసి, భార్య అప్యాయంగా వడ్డించిన నాలుగు మెతుకులూ తిని కొంతలోకొంత తృప్తి ఫీలవుతూ పడుకుంటాడు_ అయినా ఓ పట్టాన నిద్ర పట్టదు. పెరుగుతున్న ధరలు, ఎదిగిన కూతురు శారద పెళ్ళి, ఎదుగుతున్న పిల్లల చదువులు, తరుగుతున్న తన ఆరోగ్యం__ ఇవన్నీ సోమశేఖరం మనసును కలచివేసే సమస్యలు.... అన్నీ ఆలోచిస్తూ చాలా ఆలస్యంగా నిద్ర పోతాడు.... ఇది ప్రతిదిన చర్య.

అలాగే ఆ రోజు రాత్రి ఆయన మామూలుగానే ఇంటికి వచ్చారు....స్నానం చెయ్యటానికి వెళ్ళినప్పుడు బావిదగ్గిర కూతురు శారద కాకుండా భార్య అనసూయమ్మ నీళ్ళుతోడుతూ కనిపించడంతో సోమశేఖరంగార్కి అనుమానం వచ్చింది.

"నీళ్ళు నువ్వుతోడుతున్నావ్, అమ్మాయి ఏది ?" అడిగాడు.

"అమ్మాయి ఎవరో స్నేహితురాలింటికని వెళ్ళిందండీ"- దాచకుండా చెప్పేసింది.

"ఎవరు ఆ స్నేహితురాలు ?"

"అప్పుడప్పుడు మన యింటికి రాదుటండీ....కళ్యాణి ! వాళ్ళింటికనే వెళ్ళింది."

"ఏ స్నేహితురాలైనా - ఆడపిల్ల - ఇలా ప్రొద్దు బోయే వరకు తిరగటం నాకేం నచ్చలేదు. ఈ మాట అమ్మాయ్‌రాగానే చెప్పెయ్" అన్నాడు బొక్కెనలో నీళ్ల బుడబుడ ఒంటిమీద దిమ్మరించుకొంటూ.

స్నానం చేసి వచ్చిన సోమశేఖరం గార్ని ముందు గదిలో కూర్చొని చదువుకొంటున్న పదమూడేళ్ళ రమణ, పదేళ్ళ లలిత - ఇంగ్లీషు పాఠంలో తమకు బోధపడని పదాలకు అర్థం అడగడంతో భోజనం మాట మరిచిపోయి అక్కడే వాలుకుర్చీలో కూర్చుండిపోయారు, వాళ్ళు అడిగినది విడమరిచిచెబుతూ.

"వడ్డించాను రండి...." అనసూయమ్మ మూడవసారి కూడా పిలవటంతో తప్పదన్నట్లే లేచారు సోమశేఖరం.........ఆదే సమయంలో ఓ ఫియట్‌కారు రయ్‌న వచ్చి తమ యింటి ముందు ఆగటం, దాని లోంచి దిగిన శారద హుషారుగా లోపలికి వస్తూండటం గమనించిన ఆయనలో కదలిక నశించిపోయింది కొద్దిసేపు. శారదను దింపిన కారు వెంటనే వెళ్ళిపోయింది.

లోపలికి వచ్చిన శారదకు ముందుగదిలోనే తండ్రి కనిపించటంతో పెద్ద 'షాక్' అనిపించింది. అయినా తమాయించుకొని, 'కళ్యాణి బలవంతంచేస్తే సినిమాకు వెళ్ళక తప్పలేదు నాన్నగారూ.... ఆ కారు వాళ్ళదే.... అంటే వాళ్ళ అన్నయ్యగారిది...." చెప్పింది సంజాయిషీగా.

సోమశేఖరం మనసు పరిపరి విధాల పోతున్నా - అప్పటికి మాట్లాడవలసింది తోచనట్లు, "సరే, భోంచేద్దువుగాని రా....ఏమే.... అమ్మాయి కూడా వచ్చింది....వడ్డించు...." అన్నారు.

## 2

తండ్రి మనస్తత్వం గురించి శారదకు పూర్తిగా తెలుసు. ఆయన నిండు కుండలాంటి మనిషి. తొందరగా బయటపడడు. తూలి మాట అనడు. అన్నాడో - ఇక దానికి తిరుగేలేదు... ఇంట్లో అంతా పడుతున్న అవస్థలు చూసి తను ఉద్యోగం చేస్తానంది. "వీల్లేదు. రేపు పెళ్ళయ్యాక మీ ఆయన ఇష్టపడితే అలాగేచెయ్యి"అన్నాడు. అంతే. ఆ ప్రసక్తి మరి తేనివ్వలేదు........ అయితే వివాహప్రయత్నాలు ఎన్ని చేస్తున్నాపరిస్థితులు అనుకూలించటంలేదు ....

కానీ....ఒకవిధంగా తను తండ్రిని మోసంచేస్తోంది?.... చేస్తున్నది ఆయన దృష్టిలో తప్పేకావచ్చు. కానీ: తనకుమాత్రం ఇంతకు మించి గత్యంతరం లేదు.

ఆశలు, ఆనందాలు - వీటికి దూరమై ఎవరు మాత్రం ఎంతకాలం బ్రతకగలరు ?.... పుట్టి బుద్ధెరిగింది మొదలు ఓ అందమైన బట్టకట్టింది లేదు. ముచ్చటకైనా ఓ నగ పెట్టుకున్న పాపాన పోలేదు.... ఏ ఉద్యోగంలోనైనా చేరితే తన ఆకాంక్షలు కొంతలో కొంత తీరతయ్యనుకుంటే పడనివ్వలేదు. అధమం పెళ్ళై ఏ పరాయింటికైనాపోతే అక్కడైనా తన ఆనందాలు నెరవేర్చుకోవచ్చనుకుంటే అదీ జరిగేట్టు లేదు.

ఈ ఆశనిరాశలమధ్య బహుకాలం కొట్టుకులాడలేకే తను తెగించింది...కలిసివచ్చిన అదృష్టంగా భావించుకొని హేమంత్‌ను ప్రేమించింది... అతడు పెద్దఅందగాడు కాకపోయినా ఐశ్వర్యవంతుడు! పైగా తన ప్రాణస్నేహితురాలు కళ్యాణికి అన్నయ్య - పెద్దమ్మ కొడుకట.... తను అతడికి ఎంతోనచ్చిందిట... అందుకే మనసులు కలిశాయి.

ఇందాక హేమంత్ కారులోంచి తను దిగటం తండ్రిచూశాడు. మనసులో ఏం మథన పడుతున్నాడోగాని - పైకి మాటమాత్రం అనలేదు... ఏదైతేనేం ? తనుపెదవి విప్పి చెప్పకుండానే ఆయనకు కొంతలో కొంత నిజం తెలిసిపోయివుంటుంది. ఇదీ ఒకందుకు మంచిదే .......

- ఆలోచనల మధ్య శారదకు నిద్ర పట్టటంలేదు.

కళ్యాణి, తను క్లాస్‌మేట్స్........ఆర్థిక సారూప్యమేనేమో తమని మరింత దగ్గరగా చేర్చింది........ సమయం చిక్కినప్పుడల్లా కళ్యాణి తమ యింటికి రావటం, తను వాళ్ళయింటికి వెళ్ళటం జరుగుతూండేది.... చదువు అయిపోయాక కూడా అంతే.... పరిస్థితులిలా ఉండగానే కళ్యాణి తండ్రి అనుకోకుండా కన్నుమూశారు. దాంతో వాళ్ళ కుటుంబ పరిస్థితులు మారిపోయి-ఉద్యోగ ప్రయత్నంలోపడింది అది........

అటువంటి సమయంలోనే తను ఓ రోజు సాయంత్రం కళ్యాణి వాళ్ళ ఇంటికి వెళ్ళింది.అక్కడ కనిపించాడు హేమంత్! తన పెద్దమ్మ కొడుకుగా అతణ్ణి పరిచయంచేసి,

"అన్నయ్య మొన్నమొన్నటి వరకూ నాకూ తెలియదు. అసలు నాకోపెద్దమ్మ ఉన్నట్లు కూడా చెప్పలేదు అమ్మ....అదంతా ఓపెద్ద కథట.... అన్నయ్యమాత్రం చాలా మంచి మనిషే. నాన్నపోయి మేము ఇబ్బందుల్లో ఉన్నామని తెలిసి ఆదుకోవటానికి వచ్చాడు.... నువ్వు చూడలేదేమోగాని ఈ మధ్య అప్పుడప్పుడు మా యింటికి వచ్చిపోతూనే ఉన్నాడు అన్నయ్య....సందర్భం కలిసిరాక నేనే నీకు చెప్పలేదు ఈ విషయం." అంది కళ్యాణి.

"అలాగా!" అని "సరేగాని కళ్యాణీ, ఇందాక మీ పెద్దమ్మ గార్ని గురించి చెప్పబోయి అదో పెద్ద కథ అన్నావు. ఏమిటది?" అనడిగింది తను కుతూహలంకొద్దీ.

"ఏముందే.... ప్రేమకథ.... షరా మామూలే....మా అమ్మ ప్రేమించి పెళ్ళిచేసుకున్న బాపతు.... కులగోత్రాలు పట్టించుకోకుండా అమ్మ పెళ్ళి చేసుకోవటం పెద్దమ్మ దృష్టిలో పెద్దనేరమైంది....ఆవిడ పూర్వకాలపు మనిషి...ఆ చాందసాలతో అప్పట్నుంచీ ఇప్పటి వరకు మా గడప తొక్కలేదు.... స్వంత చెల్లెలి పసుపు కుంకుమలు పోయాయని తెలిశాక కూడా ఆవిడ రాతిగుండె కరగలేదు... అయితే పెద్దమ్మకు తప్ప పుట్టాడు అన్నయ్య. అయిన వాళ్ళమైన మేము ఇబ్బందుల్లో ఉన్నామని తెలిసి-తల్లికి ఇష్టంలేకపోయినా మా యింటికి వస్తూ పోతూ - తనకు చేతనైన విధంగా సహాయపడుతున్నాడు.... నిజంగా ప్రస్తుత పరిస్థితుల్లో అన్నయ్యే ఆదుకోకపోతే మేము ఏమైపోయేవాళ్ళమో....?"

అంటూ కళ్యాణి చెప్పినదాన్నిబట్టి కథంతా అర్థమైపోయింది శారదకు....దాంతో హేమంత్ ఒక ఉదార స్వభావుడిగా చిత్రించుకు పోయాడు తన హృదయంలో.

హేమంత్‌తో అక్కడ - అలా పరిచయమైంది.

"అతిశయోక్తిగా భావించుకోనంటే మీకోమాట చెబుతాను శారదగారూ" అన్నాడు హేమంత్ - ఓ రోజు.

"చెప్పండి...." అని మాత్రం అనగలిగింది తను. అసలు అతడి ఎదురుగా నిలబడట మంటేనే తగని సిగ్గుగా ఉంది. ఇక ధైర్యంగా ఏం మాట్లాడ గలుగుతుంది?

"మీరు చాలా అందంగా ఉంటారు."

అతడి ఆ కాంప్లిమెంట్ విన్నాక అక్కడ నిలబడలేక తుర్రున లోపలికి పారిపోయింది.

"ఎందుకే శారదా, అంతసిగ్గు?....అన్నయ్య ఏమైనా నిన్ను నములుతాడా. మింగుతాడా?....సరదాగా మాట్లాడటం అతడికి అలవాటు...నువ్వు అందంగా ఉన్నావు. ఆ మాటే అతడుపైకి చెప్పాడు ఆ మాత్రం దానికేనా నువ్విలా పారిపోయిరావటం? ఎంత చదువుకున్నా నువ్వు ఈ కాలానికి పనికిరావే."

—కళ్యాణి ఎత్తిపొడుపుకు ఓర్వలేకపోయింది తను.

"ఏం, మీ అన్నయ్యంటే నాకేంసిగ్గు? ....నేనతడి ముందు నిలబడలేనా. మాట్లాడ లేనా? పద...." - అంటూ తిరిగి కళ్యాణితో ఇవతలికి వచ్చింది.

"....పనుంది. వస్తాను పిన్నీ...." అంటూ కళ్యాణి తల్లి శ్రీలక్ష్మికి చెప్పి హేమంత్ అప్పటికే బయటికి వెళ్ళిపోవటంతో - తనగుండెల మీద బరువు తాత్కాలికంగా తీసినట్లైంది.

అప్పట్నుంచీ కళ్యాణి వాళ్ళ ఇంట్లో తరచు కనిపించేవాడు అతడు. పైగా మంచి కలుపుగోలు మనిషి...రాను రాను హేమంత్ అంటే తనకు పూర్తిగా బిడియం పోయింది. చాలా సాయంత్రాలు కళ్యాణి వాళ్ళ ఇంటివెనక పొన్నావి చెట్టుక్రింద కూర్చొని కబుర్లాడుకున్నారు....ముగ్గురూ కూర్చున్నాక ఏదో విషయం మీద చర్చ - మధ్యలో ఉన్నట్లుండి కళ్యాణిని తల్లి పిలిచేది. 'ఇప్పుడేవస్తాను. మీరు మాట్లాడుతూండండి' అని చెప్పివెళ్ళేది అది. తమ ఇద్దర్నీ ఒంటరిగా వదిలివేయటం దాని ఉద్దేశ్యం కావచ్చు....అలా వెళ్ళిన కళ్యాణి చాలా సేపటివరకు వచ్చేది కాదు....ఈలోగా హేమంత్" మీరు అందంగా నవ్వుతారు. ....అణకువగా మాట్లాడతారు....అందుకే మీరంటే నాకెంతో ఇష్టం...." అంటూ మొదలు పెట్టి "మాకు కావలసినంత ఆస్తి ఉంది....నేను మా అమ్మగారికి ఒక్కడినే కొడుకును....పుట్టి బుద్ధెరిగాక ఇంతవరకు ఆవిడ నా మాట కాదనలేదు. ఇకముందూ అలాఅనదు....నాకు ఆ నమ్మకం ఉంది.....ఇక మీస్థితి గతులతో నాకు నిమిత్తం లేదు. .... నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్న మీరు కనుక హృదయపూర్వకంగా అంగీకరిస్తే— మిమ్మల్ని వివాహం చేసుకోవాలనుకుంటున్నాను" అంటూ తన నిర్ణయం చెప్పి "మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగేవాడు.

ఆ వ్యక్తి మంచితనంచూసి, అతడి ఆ మాటలు విన్నతర్వాత ఏమని జవాబిస్తుంది? సంతోషంతో తల మున్కలవటం మినహా సమాధానం చెప్పేదికాదు. తన మౌనాన్ని అతడు వేరేవిధంగా అర్థంచేసుకొని, "పిన్ని విషయంలో ఎంతో కఠినంగా వ్యవహరించటాన్ని బట్టి - మాఅమ్మగార్ని మీరు వేరేవిధంగా అంచనా వేసుకొనే అవకాశం ఉంది.... ఒకవేళ మన ప్రేమను ఆవిడ కాదన్నా మిమ్మల్ని నేను పెళ్ళాడి తీరుతాను. ఆస్తి పాస్తులు రాకుండా పోయినా-నాకు మనసారా నచ్చిన మీరుతోడుంటే - ఎంతో హాయిగా బ్రతకగలను. ఏ చిన్న ఉద్యోగమో చూసుకొని ...." అంటూ ధైర్యం చెప్పేవాడు.

"మా అన్నయ్య ఎంతో యోగ్యుడు. నువ్వంటే ఇష్టపడుతున్నాడు.... ఇది అందివచ్చిన అదృష్టంగా భావించుకొని 'ఊఁ' అనే సెయ్యికూడదా" అని కళ్యాణి వత్తిడిచేసేది.

తన మనసులోని ఆశలు, కుటుంబ పరిస్థితులు, హేమంత్ కలిపించే ధైర్యం, కళ్యాణి పెట్టే వత్తిడి— వీటి అన్నింటి కారణముగా తను అతడి విషయంలో సుముఖమైన నిర్ణయానికివచ్చి— ఆ మాటే ఓ నాడు చెప్పేసింది బయటికి.... ....

ఇంతకాలం తమ ప్రేమవ్యవహారం అంతా కళ్యాణి ఇంటి నాలుగ్గోడలమధ్యే— అయితే ఈరోజు హేమంత్‌తో సినిమాకు వెళ్ళటం, సరాసరి అతడికారులోనే ఇంటికి రావటం- ఆ దృశ్యం తండ్రి కంట పడటం- అంతా ఓ కలలా జరిగి పోయింది.

....అయినా భయపడవలసిన పనిలేదు... తనంటే ఎంతో ఇష్టపడే హేమంత్— తనని పెళ్ళాడే విషయంలో ఎటువంటి శంకలకు తావులేదు.

ఇక.... లక్షాధికారైన హేమంత్‌కు తాను అర్ధాంగి కాబోతోంది. అతడు తనవాడు అతడికారు.... వాళ్ళ లంకంత ఇల్లు.... అన్నీ తనవే.... కోరినతిండి, నచ్చిన బట్టలు, నగలు....! తమ్ముడు, చెల్లాయి- వాళ్ళు చదువుకున్నంత వరకు తానే చెప్పించవచ్చు.

....కళ్యాణి అన్నట్లు నిజంగా తను అదృష్టవంతురాలే...ఎంతో తృప్తి ఫీలవుతూ హాయిగా నిద్రలోకి జారుకొంది శారద.

## 3

రామానగరం ఆ పట్టణానికి అతి దగ్గరలో ఉన్న ఓ పల్లెటూరు. డెల్టా ఏరియా అవటం మూలాన పాడిపంటలకు కొదువలేదు. సిటీ బస్ సౌకర్యం ఉంది. పేరుకుపల్లె అయినా చాలావరకు బస్తీపోకడే కనిపిస్తుంది అక్కడ. నీటి కొళాయిలు, సిమెంట్‌రోడ్లు, ఓ పర్మినెంట్ సినిమాథియేటర్, కొన్నిహోటళ్ళు-బడ్డీలు- అన్నీ ఉన్నయ్ సౌకర్యాలు.

ఆ రాత్రి ప్రొద్దుపోయిన తర్వాత హేమంత్ కారు అందమైన రామానగరం నడిరోడ్డుమీద పోతూ కుడివైపు మలుపుతిరిగింది. అక్కడ ఓ పెద్దలోగిలి- దానికి విశాలమైన ఆవరణ, చుట్టూ ప్రహరీగోడ- గేటు- ఆ గేటుముందు కారుఆపి హారన్‌కొట్టాడు గట్టిగా. ఏమూలో పడుకొని కునుకుతున్న పనివాడు కొండయ్య ఆదరాబాదరాగా, ఊడిపోతున్న గోచీని సరిచేసుకొంటూ వచ్చి- గేటుతెరిచి వినయంగా నిలబడ్డాడు.

హేమంత్ మాట్లాడకుండానే కారులోపలికి పోనిచ్చి షెడ్‌లో పార్కుచేశాడు.... ఈలోపల అతడితల్లి జగదీశ్వరి సింహద్వారం తలుపుతీసి బయటికి వచ్చింది.

"ఏమిటమ్మా, నువ్వింకా నిద్రపోలేదా?" అంటూ తల్లిని అనుసరించి లోపలికి వచ్చాడు హేమంత్.

".... ఇంత పెద్దలోగిలి.... నేనేమో ఒంటరిదాన్ని.... నువ్వు ప్రొద్దస్తమానం ఊరుపట్టుకొని తిరుగుతావ్.... ఎవరూతోడు లేకుండా నేను ఈ ఇంట్లో ఉండలేక పోతున్నారా అబ్బాయ్.... పడుకున్నది మొదలు- వెధవవి- ఒకటేపీడకలలు...." అంది జగదీశ్వరి.

తల్లి పరిస్థితిని తలుచుకొని జాలిపడ్డాడు హేమంత్.

"ఆదివరకు కొంచెం సేపైనా ఇంట్లో ఉండేవాడివి.... ఆ కారు కొన్నాకే నీకుతిరుగుడు ఎక్కువైంది అయినా స్కూటరు ఉండగా కారు ఎందుకు?.... నువ్వేమైనా లక్షలు సంపాదించే వ్యాపారస్తుడివా, వేలకువేలు సంపాదించే ఉద్యోగస్థుడివా?.... పెట్రోలుకనీ, రిపేర్లకనీ తెగ తినేస్తోంది ఆ పాడు కారు... నా మాటవిని దాన్ని అమ్మెయ్‌రా" అంది జగదీశ్వరి.

"అలాగేలే అమ్మా... ఏదో మనసుపడి కొన్నాను. మోజు తీరి పోయిందిగా.....ఇక అమ్మేస్తాను...." అనేవాడు రోజూతల్లి పెట్టే పోరుపడలేక.

...."సరే....రా....వడ్డిస్తాను, భోం చేద్దువుగాని" అంటూ వంట ఇంటివైపు నడిచింది జగదీశ్వరి.

హేమంత్ బట్టలు మార్చుకొని భోజనానికి వెళ్ళాడు.

"ఈ వేళ ఎక్కడికి వెళ్ళావ్?"

కలుపుకున్న ముద్ద నోట్లో పెట్టుకోబోతున్న హేమంత్ - తల్లికి ఏమని సమాధానం చెప్పాలో అన్న ఆలోచనలోపడ్డాడు. స్నేహితులనీ, పార్టీలనీ రోజూ ఒకటే సమాధానం అయితే ఆవిడకు తన మాట మీద నమ్మకం పోతుంది....మరి ఏమని చెప్పాలి?

ఏమిట్రా ఆలోచన?....వెళ్ళిన చోటు, చేసిన పని చెప్పటానికి ఎందుకు అంత జాగు? దానింటికి వెళ్లావా?

"....పిన్నివాళ్ళ ఇంటికా?.... వెళ్ళానమ్మా.... బాబాయి పోయాక పాపం వాళ్ళు చాలా ఇబ్బందుల్లో పడ్డారు...."

"చేసుకున్న దానికి చేసుకున్నంత మహదేవ అన్నారుమరి.... ఇప్పుడుచూడు- ఆడపిల్లపెళ్ళి, మగపిల్లడి చదువు- దానివల్ల అవుతుందిరా?"

"ఎందుకుఅమ్మా, ఒకేతల్లికడుపున పుట్టిన పిన్నిఅంటే నీ కింతకసి ?"

"పుట్టాంరా... అయితే మాత్రం ?... పెద్దలమాట విని లక్షణంగా పెళ్లిచేసుకొని నాలా హాయిగా బ్రతక్కుండా - ప్రేమ దోమ అంటూ ఎవడో కులం లేనివాణ్ణి కట్టుకుంటుందా అది ?.... దాని దిగులుతోనేరా గుండ్రాయిలా ఉండే మానాన్న, ఏ జబ్బూ లేని మా అమ్మా — అంత తొందరగా చనిపోయింది.... పోనీలే. చల్లటి వేళప్పుడు ఆ పాపిష్టిదాని ఊసు మనకెందుకు గాని - మామయ్య మొన్నరాసిన ఉత్తరానికి ఏమని జవాబురాస్తావ్ ?.... నువ్వు హైద్రాబాద్ ఎప్పుడు వెళ్తావ్ ?"

తల్లి మామయ్య, హైద్రాబాద్ — ఆ ప్రసక్తి తేవటంతో హేమంత్ ముఖంలో రంగులు మారిపోయాయి. చక చక రెండుముద్దలు తినేసి చెయ్యికడిగి ఇవతలకి వచ్చేశాడు.

"నాకు తెలుసు హేమంత్ నీమనసు.... ఈ విషయంలో నేను నిన్ను బలవంతపెట్టను.... అయితే కొంచెం లోతుగా ఆలోచించమంటున్నాను....రజని అంటే మొదట్నుంచీ నీకు ఎంత ప్రేమో నాకుతెలుసు ....జరిగి పోయిన దానికి ఇప్పుడు అదీ ఎంతో పశ్చాత్తాప పడుతోందట.... ఈ ఒక్కసారికీ నామాట విని హైద్రాబాద్ వెళ్ళు.... ఎందుకంటే రజనిని నువ్వు అగ్నిసాక్షిగా పెళ్ళాడావు!"- వంటగది సర్దివచ్చి హాలులో ఆలోచిస్తూ కూర్చున్న కొడుకుతో అంది జగదీశ్వరమ్మ.

"అగ్ని....సాక్షి....పెళ్ళి ...." అంటూ కసిగా వత్తి వత్తి పలికి "అదో పీడకల దాన్ని మరిచిపోయి నేను చాలా కాలమైంది.... చివరిసారిగా చెబుతున్నాను. అమ్మా, నేను ఆత్మాభిమానం ఉన్న మనిషిని. అది చావాల్సివచ్చిన రోజున దానితోపాటు నేనూ చచ్చిపోతాను." అని తెగవేసినట్లు చెప్పి, వెనుకనుంచి తల్లి ఏమిటో అంటున్నా వినిపించుకోకుండా తనగదిలోకి వెళ్ళి ఫెళ్ళున తలుపులు మూసేసుకున్నాడు హేమంత్.

మెత్తని పరుపు కూడా అతడికి అంపశయ్యలా ఉంది.... బయటి వాతావరణం ఎంత చల్లగా ఉన్నా ఉక్కపోస్తున్నట్లు చిరాకు అనిపిస్తోంది.... లేచివెళ్ళి కిటికీ దగ్గిర నిలబడి సిగరెట్ మీద సిగరెట్ వెలిగిస్తూ గుప్పుగుప్పున పొగ వదులుతున్నాడు....ఎంత నిగ్రహించుకుందామన్నా గతం జ్ఞప్తికి వస్తూనే ఉంది హేమంత్‌కు....

## 4

హేమంత్ తండ్రి నారాయణరావు. ఆయన చెల్లెలు సీత.... 'లోకంలో అందరు అన్నా చెల్లెళ్ళకంటే వాళ్ళిద్దరి మధ్య ఆప్యాయానురాగాల పాలు కొంచెం ఎక్కువేమో !' అన్నట్లు నడుచుకొనేవారు. అదేం చిత్రమో ! వాళ్ళ ఇద్దరికీ ఒక్కరొక్కరే బిడ్డలు....ముందు హేమంత్ పుట్టాడు. తనకు అల్లుడు పుట్టాడని మురిసిపోయింది సీత....తర్వాత యాణ్ణర్థానికి రజనిపుట్టింది. తనకు కాబోయేకోడలు పుట్టిందని ఆనందించాడు నారాయణరావు. వాళ్ళిద్దరూ భార్యాభర్తలుగా చిన్నప్పుడే గుర్తింపు పొందారు.

అప్పుడు హేమంత్‌కు పధ్నాలుగవ ఏడు. రజనికి పన్నెండవ సంవత్సరం వచ్చింది..... ఉన్నట్లుండి సీతమ్మ జబ్బున పడింది. కడుపులో వ్రణం. ఆపరేషన్ చేయాలన్నారు డాక్టర్లు ... ఏ ఆపరేషన్ చేసినా ఇకతాను బ్రతికి బట్టకట్ట గలగటం మీద అపనమ్మకం బయలుదేరిన సీత- 'అనుకున్న ప్రకారం నాకూతుర్ని నీ కోడలిగా చేసుకో అన్నయ్యా- వాళ్ళిద్దరూ పసుపు బట్టలతో నిలబడితే చూసి ఆనందించాలని ఉంది' అంటూ తన కోర్కెను బయటపెట్టింది. 'అదెంతభాగ్యం, అలాగే జరిపిస్తాను సీతా!' అంటూ చెల్లెలిమీది మమకారం కొద్దీ వెంటనే ఏర్పాట్లు చేయించాడు నారాయణరావు.... హేమంత్, రజని కూడా పెళ్ళంటే సిగ్గుపడ్డారే గాని 'ఇప్పుడే మాకెందుకు పెళ్ళి?' అని ఎదిరించలేక పోయారు. అయినా అప్పుడు వాళ్ళ వయసెంత, మనసెంత?... బొమ్మల పెళ్ళిలా తంతు జరిగిపోయింది.

చివరికి ఆపరేషన్ పూర్తయి సీతమ్మ బ్రతికింది.... అయితే తర్వాత ఓ రోజు ఆకస్మాత్తుగా గుండెపోటువచ్చి నారాయణరావే కన్నుమూసాడు. విధివిలాసం మరి!

"భగవంతుడిలా అన్యాయం చేస్తాడని అనుకోలేదు వదినా.... అంతజబ్బునపడ్డాను. నేనే పోవలసింది....కానీ, అన్నయ్య నిమిషంలోకి చెయ్యిదాటిపోయాడు....ఇక ఈ లంకంత ఇంట్లో మీ తల్లీకొడుకు ఒంటరిగా ఉండాలంటే కష్టమే....అందుకనే మీ యిద్దరూ హైదరాబాద్ వచ్చి మా యింట్లో ఉండిపోండి వదినా...." - అంది సీతమ్మ.

"ఎప్పుడూ పదిమందితో కళకళలాడుతూండేది ఈ లోగిలి.... అలాంటి దీన్ని పాడుబెట్టి నేను, నా కొడుకు మీ యింటికి వచ్చి ఉండటమా?.... వద్దుసీతా. ఉన్నభూమిని, కన్న కొడుకును కనిపెట్టుకొని నేను ఇక్కడే ఉండిపోతాను." - అంది జగదీశ్వరమ్మ దృఢంగా.

"....పోనీ. వదినా, చదువుకొని వృద్ధిలోకి రావలసినవాడు హేమంత్ .... ఈ వూళ్ళో హైస్కూలు లేదు.... రోజూ బస్తీకి

పోయి రావాలంటే కష్టం. చదువు సాగదు. ఇంత కాలం అంటే అన్నయ్య లేడు.... నువ్వేమో ఆడదానివి.... నా వుద్దేశ్యమేమిటంటే వదినా, హేమంత్‌ను హైద్రాబాద్ తీసుకువెళ్తే రజని, అతడు కలసి చదువుకుంటారు.... ఒకచోట మెసిలితే వాళ్ళమనసులూ దగ్గరవుతయ్" అంటూ తన అభిప్రాయం చెప్పింది సీత.

"సరే సీతా, కూతుర్నిచ్చి చేసినవాళ్ళు మీరు. మీ అల్లుడి బాగోగులు నాకంటే మీకే ఎక్కువ తెలుస్తయ్.... హేమంత్‌కు ఇక్కడ ఒకటే గారాబం.... నాకూ దూరంగా ఉంటేనైనా చదువు శ్రద్ధగా సాగుతుందేమో.... నీ మాట్రపకారమే కానియ్" అంటూ జగదీశ్వరమ్మ తన సమ్మతి తెలిపింది.

హైద్రాబాద్ వంటి మహానగరం వెళ్లి— అక్కడ చదువు కోవటమంటే హేమంత్‌కూ సరదాగానే ఉంది. పైగా రజని ఎప్పుడూ తన పక్కనే ఉంటుంది... ఎందుకంటే ఆమె అంటే అతడికి తగని ఇది.... అందుకే ఏమాత్రం ఎదురు చెప్పలేదు.

* * *

హేమంత్ చిన్నప్పట్నుంచి ఆటలన్నా, సరదాగా తిరగటమన్నా ఎక్కువ ఇష్టపడేవాడు. చదువులో మాత్రం మందమే.... హైద్రాబాద్ వచ్చాక రజనితండ్రి రామచంద్రరావు అతణ్ణి, కూతుర్ని కలిపి మెట్రిక్‌కు కట్టించారు. వాళ్ళిద్దరి కోసం ఓ ట్యూటర్ని కుదిర్చాడు. ఆయనే ఇంటికివచ్చి చదువు చెబుతూండేవాడు.

రజని అందమైనదేకాదు. తెలివైనదికూడా ! చదువంటే ఎంతో శ్రద్ధ. హేమంత్‌కు ఆమెపెట్టిన ముద్దుపేరు 'కోతిబావ'. అందుకు తగినట్లే ఉండేవి అతడి పనులూను...

ఓ రోజు రాత్రి హేమంత్, రజని ఒకేటేబిల్ ముందు రెండు కుర్చీలలో కూర్చొని చదువుకుంటున్నారు. రజని మరోధ్యాస లేకుండా పుస్తకంలోకే చూస్తోంది. హేమంత్ పనల్లా రజనివైపు చూడటమే. కొన్నిసార్లు ఆమెను మాట్లాడించటానికి ప్రయత్నించాడు. అందుకు విసుక్కొంది రజని... 'నీపని ఇట్లాకాదు' అని లేచి బయటికి వెళ్ళి నట్లేవెళ్ళి— పిల్లిలా తిరిగివచ్చి రజని రెండుజడలను కుర్చీకి కట్టేడు. తర్వాత "మీఅమ్మ పిలుస్తున్నట్లుంది. వెళ్ళు రజనీ" అన్నాడు. 'అమ్మకేం పనిలేదు' అంటూ అయిష్టంగానె లేచివెళ్ళబోయింది. కానీ లేవలేకపోయింది.... తన జడలు కుర్చీకి కట్టి ఉండటం, పక్కనే కూర్చున్న హేమంత్ పగలబడి నవ్వుతూండటంతో, ఏయ్, కోతీ... చేసిన పాడుపని చాలక నవ్వుతున్నావా?" అంది కోపంగా.

అయినా, ఆమె మాటలను పట్టించుకోని హేమంత్ "కోపంలో ఉన్నప్పుడే నువ్వు అందంగా ఉంటావు రజనీ.... అందుకే— నీకు కోపం తెప్పించాలని ఇలాచేసాను" అంటూ ఆమె జడకట్లను తానే ఊడదీశాడు.

అటువంటి పనులు మరెన్నో చేసి 'కోతిబావ' గానే స్థిరపడి పోయాడు హేమంత్ రజని మనసులో.... రజని అలా పిలవటమే ఇష్టంగా ఉండేది హేమంత్‌కు.

పరీక్షా ఫలితాలు తెలిసినయ్.... రజని ప్యాసైంది. కానీ, హేమంత్ తప్పాడు.

"నాకు ముందే తెలుసు కోతిబావా, నువ్వు తప్పుతావని. నేను అనుకున్న ప్రకారమే జరిగింది. మరి ఒక్కరోజైనా సరిగ్గా చదివి తేగా? .... పైగా చేసేవన్నీ తిక్కపనులు...." అంది రజని.

"తప్పటం, ప్యాసవటం మనచేతుల్లో ఉన్నయ్యా హేమంత్? ఏదో చేతనైన ప్రయత్నం చెయ్యగలుగుతామేగాని— అంతకుమించి ఎవరుమాత్రం ఏం చేయకలుగుతారు" అంటూ హేమంత్ మనసు నొచ్చుకోకూడదని సర్దిచెప్పింది సీతమ్మ.

"ఔనోయ్ హేమంత్, మరోసారి ప్రయత్నించు.... ఈసారి నువ్వు తప్పకుండా ప్యాసవుతావు. నాకు ఆ నమ్మకం ఉంది" అన్నాడు రామచంద్రరావు అల్లుడికి గుండె ధైర్యాన్నిస్తూ.

"ఎన్నిసార్లు ప్రయత్నించినా బావ ప్యాసుకాలేడు నాన్నా.... వట్టి మట్టిబుర్ర" అంది రజని తేలికభావంతో.

- చిన్నప్పట్నుంచీ ఎంత గారాబంగా పెంచినా - అప్పుడు అలా మాట్లాడిన కూతుర్ని ఆ చెంప ఈ చెంప వాయించాలన్న కోపం వచ్చింది సీతమ్మకు. కానీ, తొందరపడి చేతికి పని చెప్పలేక, "నోరుమూసుకో నువ్వు.... అలా మాట్లాడవచ్చా బావముందు? రాను రాను నీకు తెలివి ఎక్కువై పోతున్నట్లుందిలే" అంటూ హెచ్చరించింది.

"అవునమ్మా రజనీ.... బావను గౌరవించటం నేర్చుకోవాలి గాని - అలా గేలి చేసినట్లు మాట్లాడకూడదు." అంటూ రామచంద్ర రావు కూడా కూతుర్ని సున్నితంగా మందలించాడు.

ఈసారి హేమంత్‌కు పౌరుషంవచ్చి కొంచెం శ్రద్ధగానే చదివాడు. అలాగే సప్లమెంటరీ పరీక్ష కట్టి - ప్యాసయ్యాడు.

"ఇప్పుడేమంటావ్ రజనీ.... ? నాది మట్టి బుర్రయితే ఎలా ప్యాసయ్యానిప్పుడు?" అడిగాడు రజనిని సగర్వంగా-పరీక్షా ఫలితాలు తెలిసిన రోజున.

"నీది ముమ్మాటికీ మట్టి బుర్రే.... ఇప్పుడు నువ్వేం చదివి ప్యాసుకాలేదు.. మానాన్నే నిన్ను కావాలని ప్యాసు చేయించాడు లంచం పెట్టి...." అంది రజని అతడి అహాన్ని దెబ్బతీస్తూ.

"నేను స్వశక్తి మీద ప్యాసు కాలేదా?.... మామయ్య లంచం పెట్టి ప్యాసుచేయించాడా నన్ను?-" అయోమయంలో పడిపోయాడు

హేమంత్. పరీక్ష ప్యాసయ్యాడన్న ఉత్సాహం నీటి బుడగ చందమైంది.

"ఔను. నీకు ఇంగ్లీషు పేపరులో మార్కులు తగ్గితే వేయించారట. మొన్న ఈ మాట నాన్న అమ్మతో చెబుతుంటే విన్నాను. కావాలంటే ఆయన్నే అడుగువెళ్ళి" అంది రజని ధృవీకరణగా.

దాంతో హేమంత్ మనస్సు కకావికలమైపోయింది.... తనకు తెలివితేటలు లేవు.... చదువంటే శ్రద్ధలేదు.... రజనిముందు జీవితాంతమూ - ఇలాగే తల వంచుకొని నిలబడవలసిందే ?

"ఇంగ్లీషులో ఒక్కమార్కు తగ్గిందని తెలిసి దాన్ని కలిపించాను.........ఆ ఒక్కమార్కు గురించి నువ్వు నిరుత్సాహపడిపోకుండా - ఏదో చేశాను. అయినా ఇదేమంత పెద్ద విషయమని ? దీన్ని గురించి నువ్వు ఆలోచించటం, బాధపడటం అనవసరం హేమంత్" - అల్లుడు అడిగినమీదట అసలు విషయం దాచలేకపోయాడు రామచంద్రరావు.

"అసలు నీకీవిషయం చెప్పిందెవరు హేమంత్?.... రజనియేనా....అది రానురాను మరీ పెంకిఘటమైపోతోంది" - అంటూ సీతమ్మ కూతురిమీద అక్కసు పడింది.

తర్వాత హేమంత్ తన స్వగ్రామం వెళ్ళి కొంతకాలం గడిపి వచ్చాడు.

## 5

హేమంత్‌తో పాటు రజనీని కాలేజీలో చేర్పించాడు రామచంద్రరావు.

అసలు మెట్రిక్ ప్యాసవగానే నేను కాలేజీలో చేరతానని పట్టుబట్టింది రజని. కానీ, వయసు సరిపోదని అడ్డుపెట్టి ఆమెను ఆ ప్రయత్నం మానేట్లు చేశాడు రామచంద్రరావు. నిజానికి డబ్బు పలుకుబడి ఉన్న ఆయన తలుచుకోబట్టే వయసు కొంచెం తగ్గినా రజని మెట్రిక్ పరీక్ష రాయగలిగింది.అలాగే చేర్పించదలిస్తే కాలేజీలో కూడా చేరగలిగేదే ఆమె. తనని వదిలి రజనిని కాలేజీలో చేర్పిస్తే హేమంత్ ఎలా ఫీలవుతాడోననే అలా చేయలేదు రామచంద్రరావు.

అదృష్టమో దురదృష్టమోగాని - ఆ ఏడూ హేమంత్ పి. యు. సి. పరీక్ష ప్యాసుకాలేదు. పరీక్షాఫలితాలు తెలిసినప్పుడు అతడు స్వగ్రామం రామానగరంలో ఉన్నాడు....దాంతో తనకు చదువురాదు. పట్టు బలవంతాన చదివినా ఏ పరీక్షా ప్యాసుకాలేదు అన్న అపనమ్మకం ఏర్పడి ఆ మాటే తల్లితో అన్నాడు." నాకింకా చదువుకోవాలని లేదు. ఇక్కడే ఉండి వ్యవసాయపు పనులు చూసుకుంటాను" అని. కన్నతల్లి, ఒక్కగానొక్క కొడుకు - ఏమంటుంది జగదీశ్వరమ్మ ? "అలాగే కానీ.... దేనికైనా ప్రాప్తం అనేది ఉండాలి." అని ఊరు కొంది....కానీ, సీతమ్మ. రామచంద్రరావులు అలా అని సరిపెట్టుకోలేదు. "పరీక్షపోయినందుకు ఏ మాత్రం బాధపడవద్దు. మరోసారి ప్రయత్నించి చూస్తే బాగుంటుంది" అంటూ ఉత్తరాలు రాశారు. అయినా చలించలేదు హేమంత్.

....స్వగ్రామంలో ఉండి వ్యవసాయపు పనులు చూసుకుంటున్నాడు హేమంత్. రజని హైద్రాబాద్‌లో బి.ఎ. లో చేరి చదువుతోంది.... రామచంద్రరావు వాళ్ళు రెండుమూడుసార్లు ఉత్తరాలు రాశారు ఒకసారి ఇక్కడికివచ్చి వెళ్ళమని, కానీ రజని - ఆమె చేయబోయే అవహేళనల గురించి ఊహించుకొని అలా వెళ్ళలేక పోయాడు.

తను చదువు మానేయటం, భార్య దర్జాగా చదవటం - రాను రాను అవమానకరంగా తోచసాగింది హేమంత్. అందుకు కారణం ఊళ్ళోపరిస్థితులు, తెలిసినవాళ్ళు దెప్పి పొడుపుగా అంటించే చురకలు..

జగదీశ్వరమ్మ కొడుకులో వచ్చిన మార్పునుబట్టి, అతడి మనసును అర్థంచేసుకొంది. అదీ కాకుండా పనివాడు కొండయ్య ఊళ్ళో పరిచయస్థులు హేమంత్‌ను చేసే అవహేళన్ను గురించి వివరించి చెప్పటంవల్ల కూడా ఆమెకు కొడుకు పరిస్థితిని త్వరగా అవగాహన చేసుకోవటానికి వీలుకలిగింది.... కోడల్ని చదువుమాన్పించి తమ ఇంటికి తీసుకురావటమే అన్ని సమస్యలకు పరిష్కారంగా భావించుకున్న ఆమె ఓ మంచిరోజు చూసుకొని రామచంద్రరావు, సీతమ్మలతో మాట్లాడటానికి హైద్రాబాద్ వెళ్ళింది.

రజని వయసులో చిన్నది. అప్పుడే కార్యం చేసి అత్తవారింటికి పంపటానికి ఇష్టపడలేదు రామచంద్రరావు దంపతులు.... కనీసం హేమంత్ ఆవేదన తగ్గించటానికి రజనిచేత చదువైనా మాన్పించమని అడిగింది జగదీశ్వరమ్మ. అందుకు తల్లీదండ్రీ ఒప్పుకున్నారు. కానీ, రజనిమాత్రం తను చదివితీరాలని పట్టుబట్టింది.... దానిమీద అలిగి ఓరోజల్లా అన్నం తినకుండా పడుకొందికూడా. చివరికి ఏం ఆలోచించుకున్నారో ఏమో- రామచంద్రరావు దంపతులు జగదీశ్వరమ్మ మాట ప్రకారమే వెంటనే కార్యం చేయటానికి అంగీకరించారు. అది తెలిసిన రజని పూర్తిగా రెచ్చిపోయింది. తన చదువును ఎవరైనా ఆపుచేయాలని చూస్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. ఇక లాభం లేదని తిరిగి వచ్చేసింది జగదీశ్వరమ్మ.

'రజనికి తనంటే ఆకర్షణ, సదభిప్రాయం లేవు... ఇప్పుడే ఇంత చులకన భావం ఏర్పరచుకొంటే రేపు చదువుపూర్తి అయ్యాక తననెంత హీనపరుస్తుందో ఆమె?' -కృంగిపోవటం మొదలుపెట్టాడు హేమంత్, తల్లిద్వారా అన్నివిషయాలు తెలుసుకున్న తర్వాత.

...ఆ ఆలోచనల మధ్య వ్యవసాయపు పనులమీద శ్రద్ధ చూపలేక పోతున్నాడు హేమంత్. తరచు స్నేహితుల్తో ప్రక్కనేవున్న పట్నంపోయి సరదాగా కాలక్షేపం చేసిరావటం మొదలుపెట్టాడు... అర్ధరాత్రి అపరాత్రి తిరగటానికి ఇబ్బందిగా ఉందని స్కూటరు కొన్నాడు. కాదనలేదు జగదీశ్వరమ్మ.

* * *

ఒక ఏడాది గడిచింది అలా.... అదివరకులా కాకుండా హేమంత్ ఇప్పుడు ఒక్కక్షణం కూడా ఇంటి పట్టున ఉండటం లేదు. స్నేహాలు, తిరుగుళ్ళు బాగా ఎక్కువయ్యాయి. దీనిమీద ఆలోచించి కోడలు తమఇంటికి వస్తేనే కాని కొడుకుమనసు కుదుట పడదన్న నిర్ణయానికి వచ్చేసింది జగదీశ్వరమ్మ. అందుకే ఓ రోజు హేమంత్‌ను కూడా తీసుకొని హైద్రాబాద్ బయలుదేరింది.

తల్లితో ప్రయాణ మవ్వటానికి ముందు తటపటాయించాడు హేమంత్. తనువెళ్తే- 'రజనిముందు తలవంచుకొని నిలబడ వలసి వస్తుంది. మరివెళ్ళక?... ఎంతకాలం? — తను రజనిని చూసి చాలా కాలమైంది. అప్పుడు పసిమిఛాయలో బక్కపలచగా ఉండేది రజని... ఇప్పుడు ఎలావుందో? బాగా ఎదిగి- పరిపూర్ణ యవ్వనంతో నిండుగా ఉంటుంది... అవమానాలను ఎదుర్కొన్నా తను ప్రియాతిప్రియంగా భావించుకునే రజనిని ఒకసారి కళ్ళారా చూసుకు తీరవలసిందే' అంటూ మనసును దృఢపరుచుకొని బయలుదేరాడు.

నారాయణగూడలో ఉన్న రామచంద్రరావు గారి ఇంటికి చేరే సరికి మధ్యాహ్నం మూడు గంటలైంది.

* * *

హేమంత్ ఊహించుకున్నట్లుగానే రజని ఎదిగింది... ఎంతో అందం, ఆకర్షణా కూడా కనిపిస్తున్నాయి ఆమెలో... కాలేజీనుంచి ఇంటికివచ్చి ఒకసారి అందరికీ కనిపించి తనగదిలోకి వెళ్ళింది. తర్వాత బయటికి రాలేదు.

రజని తననిచూసీ మాటమాత్రమైనా పలకరించక పోవటం బాధనిపించింది హేమంత్‌కు. ఒకవేళ తనంటే ఉండే సహజమైన సిగ్గు చేత, చుట్టూపెద్దలున్నారని బిడియపడి- తనతో మాట్లాడలేక పోయిందేమో? -'ఏదోఒకటి తేల్చుకోవాలి' అనుకొని వీలుచూసి ఆమె గదిలోకి వెళ్ళాడు.

రెండోధ్యాస లేకుండా ఏదోపుస్తకం దీక్షగా చదువుతోంది రజని.

చొరవగావెళ్ళి రజని ముందు టేబిల్‌మీద కూర్చున్నాడు హేమంత్.

అతడి ప్రవర్తనకు విస్తుపోయినట్లు ఒకసారి చూసి తలదించుకొంది రజని.

"ఏమిటి రజనీ, పలుకే బంగారమై పోయింది" అన్నాడు. మాట్లాడలేదు రజని.

"నామీద కోపమా?"

"..........."

"నన్నిలా శిక్షించటంలో నీ ఉద్దేశ్యం?"

దాంతో కదలిక వచ్చిన రజని "ఎవర్ని ఎవరు శిక్షిస్తున్నట్లు?" అంది.

"నువ్వేరజనీ... నువ్వే... నన్ను శిక్షిస్తున్నావు."

"అది నీ భ్రమ."

"భ్రమకాదు రజనీ, పచ్చినిజం! ఇందాకనువ్వు కాలేజీ నుంచి వచ్చి నన్ను చూసీ చూడనట్లు ఊరుకున్నావ్... మాట మాత్రమైనా పలకరించావా?"

"ఓ, అదా!... నిన్ను చూడగానే మాట్లాడించాలనే అనిపించింది... కానీ, ఎందుకో గొంతు పెగిలిరాలేదు... అయినా ఇటువంటి చిన్నచిన్న విషయాలకు ఫీలయ్యే వాళ్ళంటే నాకు గిట్టదు."

రజనిమాటలకు కొయ్య బారిపోయాడు హేమంత్... అప్పుడే ఆమెకు స్వంత అభిప్రాయాలు, అభిరుచులు కూడా నన్నమాట!

"-ఇది చిన్న విషయమా రజనీ?- అదే నాస్థానంలో ఉంటే నీకు అర్థమయ్యేది... ఎవరో పరాయి వ్యక్తి నన్ను ఎలా బిహేవ్ చేసినా నేనసలు ఫీలయ్యేవాణ్ణి కాదు.... కానీ, నువ్వు నాదానివై యుండీ -అలా ప్రవర్తించావంటేనే నాకుబాధగా ఉంది... ఒకవేళ నువ్వే నన్ను వెతుక్కొంటూ మా ఇంటికి వస్తే- నీలా నేనూ చేస్తే- అప్పుడు నీకెలాంటి అభిప్రాయ మేర్పడుతుంది?"

"అటువంటి అనవసర విషయాలు ఊహించుకొని నేను మనసు పాడుచేసుకోను.. సరే వాదన ఎందుకుగాని- నావల్లేమైనా తప్పు జరిగిందంటే క్షమించి వదిలెయ్.... నేను చదువుకోవాలిక."

"అంటే?... నన్నిక్కణ్ణుంచి వెళ్ళమనేగా?"

"అర్థం చేసుకోగలిగితే థాంక్స్."

"సరే, నీమాట ప్రకారమే వెళ్తాను ఇప్పుడు... రేపు మాత్రం నువ్వు నాతోపాటే మాఊరు రావాలి."

"అది అసంభవం."

అడుగు ముందుకు వేయబోయి టక్కున ఆగాడు హేమంత్.

"ఏం నువ్వు మాయింటికి రావా ?"

అది నీయిష్టం బట్టికాదు. నాయిష్టాన్నిబట్టి జరగాలి."

"సరే, నీ తలపొగరేమిటో చూస్తాను...." అని పౌరుషంగా ఇవతలకి వచ్చేశాడు హేమంత్.... పైకి బింకంగా అలా అన్నా లోపల అతడిలో ఆత్మ సంఘర్షణ జరుగుతూనే ఉంది.

తను ఎంతో అపురూపంగా భావించుకొనే రజని అలా మాట్లాటం మేమిటి?— ఎందుకు ఈదురదృష్టం?.... అసలే పట్టుదల గల మనిషి రజని... ఆమెను తమయింటికి రప్పించగలడా ? ఒకవేళ బలవంతాన రప్పించగలిగినా— ఆనందంగా బ్రతకగలడా ?— ఏమైనా ఈ విషయంలో తను తొందరపడి లాభంలేదు. పెద్దది. అమ్మ— భారమంతా ఆవిడమీదేవేసి తను నిమిత్తమాత్రంగా ఉండటం మంచిది అన్న నిశ్చయానికి రాకతప్పలేదు హేమంత్‌కు.

సమయం కనిపెట్టి జగదీశ్వరమ్మ అప్పటి తమ రాకలోని అంతర్యాన్ని విడమరిచి చెప్పింది.... దీనిమీద వెంటనే తమ అభిప్రాయ మేమిటో చెప్పలేకపోయారు రామచంద్రరావు దంపతులు... చాటుగా కూతుర్ని పిలిచి మంతనాలు జరిపారు వాళ్ళు చాలా సేపు.

"నీకు ఏ విషయం అయిందీ త్వరలో ఓ ఉత్తరం రాస్తాం వదినా" అంది సీతమ్మ వచ్చి.

జగదీశ్వరమ్మ ఇంకేమని మాట్లాడుతుంది. ?—ఉస్సూరంటూ కొడుకుతో సహా తిరిగి రామానగరం వచ్చేసింది.

అలాగే ఓ వారం తర్వాత ఉత్తరం వచ్చింది. "రజనిది ఇంకా చిన్నతనం. బంధాలను, అనుబంధాలను పూర్తిగా అర్థం చేసుకోలేక పోతోంది.... మరికొంత కాలం ఓపికపడితే అన్ని పరిస్థితులూ అవే చక్కబడతయ్.... హేమంత్ యోగ్యుడు. మాకు తెలుసు. అతడు పెద్దల మాటను గౌరవిస్తాడని ఆశిస్తున్నాను" అని రాశాడు రామచంద్రరావు.

రోజులు భారంగా గడుస్తున్నయ్.... హేమంత్ తిరుగుళ్ళు ఇంకా ఎక్కువయ్యాయి.... అడప దడప రామచంద్రరావు ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు.

ఆరోజు రాత్రి ఇంటికి వచ్చిన హేమంత్‌కు " నీకు ఏదో ఉత్తరం వచ్చిందిరా అబ్బాయ్" అంటూ ఓ కవరు ఇచ్చింది జగదీశ్వరమ్మ.

. రామచంద్రరావు మామయ్య రాసే ఉత్తరాలు తల్లి పేరనే వస్తుంటయ్. మరి తనకు అంత ఇదిగా ఉత్తరం రాసింది ఎవరబ్బా— అనుకొంటూ కవరు చించాడు.

" ప్రియమైన హేమంత్ బావకు, నీ రజని—" — హేమంత్ కళ్ళు జిగేలుమన్నయ్. "తనకు.... ! .... రజని ఉత్తరం రాయటమా! " ఆశ్చర్యానందాలు మేళవించి పరవశించి— నర్తించింది హేమంత్ మనసు.

'బావా! నేనో పచ్చి మూర్ఖురాలన్న అభిప్రాయం స్థిరపడి ఉంటుంది నీలో .... తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్లు అనితేలిగ్గా నవ్వేసే పసి స్వభావం బావాసీది! అలాంటి మనఃస్థితి నుంచి నువ్వు ఎదగాలి. నన్ను నా ఆశయాన్ని అర్థంచేసుకోవాలి.

నేను ఎంత చదివినా నీ అర్థాంగినే. చదువు మన యిద్దరి మధ్య అంతరాలు సృష్టిస్తుందని నువ్వు అంటే - అది సరికాదని నేను అంటాను. ఆడది కూపస్త మండూకం అన్న మూఢ విశ్వాసాన్ని ఛేదించుకొని 'నేనూ ఓ మనిషినే. నాకూ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, శక్తి సామర్థ్యాలు ఉన్నయ్యని ఎలుగెత్తి చాటుతున్న కాలం ఇది. నేనూ ఆడదాన్నే. కాబట్టి - చదువు ద్వారా నా తెలివితేటలను నిరూపించుకోవాలి. అదే నా ధ్యేయం.... ఆ ధ్యేయం నెరవేర్చుకోవటం కోసమే నీకు దూరంగా ఉండటం జరుగుతోంది.... నీ పట్ల నేనేమైనా అమర్యాదగా ప్రవర్తించి ఉంటే నన్ను క్షమించమని మనసారా అడుగుతున్నాను.

ఏదైనా బావా, నీవు నా విషయంలో మరికొంత కాలం ఓపిక పట్టక తప్పదు. మరో సంవత్సరన్నరతో నా డిగ్రీ పూర్తైతుంది. ఆ తర్వాత నువ్వు వద్దన్నా నేను మీ యింటికి- కాదు- నా యింటికి వచ్చేస్తాను. నీ అర్థాంగిగా ఆ యింట్లో నాకుగల హక్కును చాటుకుంటాను. ఈ లోపుగా మాత్రం నువ్వు ఇక్కడికి రావద్దు. ఒక యాణ్ణర్థం తర్వాత మాత్రమే మన తీయని వలపుతలపుల - తలుపులు తీయబడతాయి. అప్పుడు మనల్ని అడ్డేవాళ్లు, ఆపేవాళ్ళు ఉండరు.... నిజం బావా!....ఇలా ఉత్తరం రాయటం నా బలహీనతగా బావించి-మనసు పట్టలేక వచ్చావో నా సంగతి తెలుసుగా ?.... మరంతే అబ్బాయి గారూ.... అత్తయ్యకు ఈ ఉత్తరం చూపించి నాపరువు తీయకేం?... మరి ఉంటాను.

ప్రేమతో 'నీ'

- రజని

ఆ ఉత్తరాన్ని ఒకటికి పదిసార్లు చదువుకున్నాడు. మొత్తానికి రజనిలో తనంటే మంచి అభిప్రాయమే ఉందన్నమాట!.... రజని తనదే....ఒక సంవత్సరంన్నర తర్వాత ఈ ఇంటికి వచ్చేస్తుంది.... అప్పుడు తను.... రజని....ఒకటే తీయని ఊహలు హేమంత్ మనసు నిండా.

రజని ఉత్తరం రాసినట్లు తెలుసుకున్న జగదీశ్వరమ్మ ఆనందానికి అవధులే లేవు.

## 6

అలా ఓ ఆరుమాసాలు గడిచాయి ...వారానికి ఒకటి చొప్పున రజని అలా ఉత్తరాలు రాస్తూనే ఉంది.... ఈలోగా ఓరోజు మిత్రుడు శివరామ్‌కు హైదరాబాద్‌లో అర్జంటు పని తగిలి- హేమంత్‌ను కూడా బలవంతం చేసి తీసుకు వెళ్ళాడు.

పనిపూర్తి అయ్యాక శివరామ్‌ను ఊరు పంపించి తను-రజన్ని ఓ సారి కళ్ళతో చూసైనా తృప్తి పొందుదామని వాళ్ళ ఇంటికి వెళ్ళాడు.

అప్పుడు దాదాపు సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది..... వెళ్ళేసరికి రామచంద్రరావు ఇంట్లోలేడు. సీతమ్మ ఒక్కర్తే ఉంది. 'రజని ఏది అత్తయ్యా ? అని అడిగితే డాబామీద ఉంది." అని 'తడుము కోకుండానే చెప్పింది ఆవిడ... ఆఘమేఘాల మీద వెళ్ళాడు డాబాపైకి.

ఏదో పుస్తకంలో లీనమైపోయి ఉన్న రజని హేమంత్ ఉనికినే గమనించలేదు.

"నేను....వచ్చాను రజనీ...." ఆనందాతిరేకంగా అన్నాడు హేమంత్.

ఆ మాటలకు ఉలిక్కిపడ్డట్లైన రజని తలఎత్తి హేమంత్‌ను చూసి నివ్వెరపోయింది.

"నువ్వు పెట్టిన గడువు తీరకుండానే నేను వచ్చాను.... అయితే, నేనిప్పుడు వచ్చింది కేవలం నీ కోసంకాదు....ఓ స్నేహితుడు బలవంతం చేస్తే పని ఉండి ఈ ఊరువచ్చాను...." అన్నాడు సంజాయిషీగా.

అతడి మాటలు రజనిని తికమకపెడుతున్నాయి.

"నిరాశతో కృంగిపోతూ, జీవితమంటేనే విరక్తి చెందిన నాకు నీ ఉత్తరాలు జీవంపోస్తున్నాయి రజనీ....నువ్వు పెట్టిన సంవత్సరన్నర గడువులో ఆర్నెల్లు తీరిపోయింది....మరో సంవత్సరమే కద— ఎలాగో ఓర్చుకుంటాలే...." అన్నాడు. హేమంత్ తన ధోరణిలో.

తను ఉత్తరాలు రాయటమా ?.... సంవత్సరన్నర గడువు పెట్టటమా ?.... చిత్ర విచిత్రంగా ఉంది రజనికి అంతా.

"రజనీ ! జీవితాంతమూ నువ్వు చెప్పినట్లే నడుచుకుంటాను .....అయితే నాదో చిన్న కోరిక. తీరుస్తావారజనీ ?" అంటూ దగ్గరగా వెళ్ళి ఆమె సమాధానం కోసం ఎదురుచూడకుండానే ముద్దుపెట్టుకోబోయాడు కానీ, రజని పడనీయలేదు.

"ఏమిటిది మేనర్స్ లేకుండా ?" అంటూ వెనక్కు జరిగింది ఆవేశపడుతూ .

హేమంత్ చెంప ఛెళ్ళుమన్నట్లైంది.

"రజనీ ! ఏమిటి నువ్వు మాట్లాడేది ?.... నాకు మేనర్స్ లేవా ?...."

"మరి ?.... నన్నుతాకే అధికారం నీకెవరిచ్చారు ?"

అదో హఠాత్పరిణామం....

"ఏమన్నావ్, రజనీ ! నిన్ను తాకే అధికారం నా కెవరు ఇచ్చారు అనికదూ - అడుగుతున్నావ్ ?" అంటూ గబుక్కున ఆమె మెడలో మంగళసూత్రాన్ని బయటికితీసి, "ఇది రజనీ....ఇదే నాకు నీపై సర్వాధికారాలూ ఇచ్చింది !.... ఇంతకాలం నేనెవరో, నా అధికారమేమిటో నీకు తెలియజెప్పకపోవటం నిజంగా నా పొరబాటే ....ఇప్పుడు చెబుతున్నాను విను.... నువ్వు నా భార్యవు .... నేను చెప్పినట్లు నడుచుకోవటం నీ విధి. తెలిసిందా ?" అన్నాడు భీకర స్వరంతో.

"ఒకళ్ళు చెప్పినట్లు నడుచుకోవటానికి నేనేం అజ్ఞానినికాదు.... నా వ్యక్తిత్వాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ చంపుకొని బ్రతకలేను" అంటూ రజనికూడా గట్టిగానే నిలబడింది.

" మరి అలా నాకు ఎందుకు ఉత్తరాలు రాస్తున్నట్లు ?"

"...ఇందాకకూడా నువ్వు నేను ఉత్తరాలు రాస్తున్నట్లు చెప్పావు— మరి నీకా ఉత్తరాలు ఎలా వస్తున్నయ్యో నాకు తెలియదు గాని— నేనుమాత్రం నీ కింతవరకు ఒక్క ఉత్తరం కూడా రాయలేదు."

ఆ మాటలు విన్న హేమంత్ తను నిలబడ్డ డాబా ఎక్కడికో కదిలిపోతున్నట్లు అనిపించింది.

అదే సమయంలో అక్కడికి వచ్చాడు రామచంద్రరావు. ఇంటికి రాగానే హేమంత్ రాకను గురించి తెలుసుకొని ఖంగారు పడుతూ.

కనిపిస్తున్న వాతావరణాన్ని బట్టి జరగవలసింది జరిగిపోయిందనిపించింది అతడికి.

తండ్రి రాకను గమనించి చరచర క్రిందికి వెళ్ళిపోయింది రజని అక్కణ్ణుంచి.

"ఏం హేమంత్, కులాసా?" - లేని ఉత్సాహాన్ని నటిస్తూ వచ్చి చైతన్య రహితంగా ఓచోట నిలబడిఉన్న హేమంత్ మీద చేయి వేశాడు రామచంద్రరావు.

సమాధానం బదులు అతడివైపు వెర్రిగా చూడటం మొదలు పెట్టాడు హేమంత్.

ఆ చూపులకు తట్టుకోలేనట్లు కొంచెం వెడంగా జరిగాడు రామచంద్రరావు.

"రజని ఏమన్నది హేమంత్?" - ఎటో చూస్తూ అడిగాడు.

"అనవలసింది అన్నది. చెప్పవలసింది చెప్పింది... అసలు రజనివి నిలకడలేని మాటలు. తొందరపాటు నిర్ణయాలు మావయ్యా... ఇన్నిరోజులుగా నాకు ఎన్నో ఉత్తరాలు రాసి - అసలు తాను ఉత్తరమనేదే రాయలేదని బుకాయిస్తోంది..." - మనసును దాచుకోలేక చెప్పాడు హేమంత్.

"రజని అబద్ధం చెప్పలేదు హేమంత్..." రామచంద్రరావు కంఠంలో మార్పు వచ్చింది.

హేమంత్ కొయ్యబారిపోయాడు.

"అదినీకు ఉత్తరాలు రాయని మాట వాస్తవమే.... రజని పేరుతో నీకువచ్చిన ఉత్తరాలన్నీ మీ అత్తయ్య చేత నేను చెప్పి వ్రాయించినవే" చెప్పేశాడు రామచంద్రరావు అసలు విషయం.

"ఎందుకు?.... నన్ను వంచించటానికి ఎందుకు ప్రయత్నించావు మావయ్యా?" దీనస్వరమైంది హేమంత్‌ది.

"నిన్ను వంచించటం కాదు హేమంత్ - రజని కన్నతండ్రిగా నా బాధ్యతను నేను నిర్వర్తించటానికి అలా చేశాను... నన్ను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు బాబూ....రజని మాకు ఒక్కగానొక్క కూతురు.... అదంటే మాకు ప్రాణం.... అసలు జరిగిన పొరబాటల్లా చిన్నతనంలోనే మీకు పెళ్ళి జరిపించటం....అది దిద్దుకోలేని పొరబాటు....ఇంతకాలం తెలిసీ తెలియని వయస్సు రజనిది... బుద్ధిజ్ఞానం తెలిశాక వివాహ బంధాన్ని అర్థంచేసుకొని తన ప్రవర్తనను మార్చుకొంటుందన్నదే మా ఆశ.... రజని మా కన్నబిడ్డ... అదెప్పుడూ మా దృష్టిలో....చిన్నపిల్లే మరి నీ దృష్టిలో....రజని నీ భార్య. ఆమె మీదఎన్నో ఆశలు పెంచుకొని, అవి నెరవేరక నిరాశ నిస్పృహలకు గురవుతూంటావు నువ్వు. అశాంతి చెలరేగే మనసు - ఏ మార్గానికి మళ్ళమంటే ఆ మార్గానికి మళ్ళుతుంది.... కానీ, అలా జరగకూడదు నా కూతురిస్థానం నీలో పదిలంగా ఉండాలి. అందుకే ఆలోచించి అలా ఉత్తరాలు రాయించటం మొదలుపెట్టాను. రజనే నీకు ఆ ఉత్తరాలు రాస్తోందన్న భ్రమ కలిగించాను.... ఒక విధంగా నేను చేసింది వంచనే.... ఆ బూటకపు ఉత్తరాలు నిన్ను తీయని ఊహల్లోకి తోసి ఉంటాయి.... మరి ఈ వేళ ఆ ఊహాసౌధాలన్నీ గాలిమేడలని తెలిసిపోయి - నువ్వు ఎంత కృంగిపోయేదీ నేను అర్థం చేసుకోగలను హేమంత్...." అని అంటున్న రామచంద్రరావు కంఠం వణికింది.

"....ఎవరు అర్థం చేసుకొన్నా ప్రయోజనం ఏముంది మామయ్యా ?"- హేమంత్ కంఠం జీరబోయింది.

'హేమంత్! నువ్వు మగవాడివి.... ఆఫ్టరాల్ ఓ ఆడదాని విషయంలో నువ్వింత బేలగా మారటం నాకేం నచ్చలేదు."

- అలా అన్న రామచంద్రరావువైపు విస్మయంగా చూశాడు హేమంత్.

"ఔను హేమంత్! నీ జీవితం - నీ యిష్టం.... ఇక నువ్వు ఎలా నడుచుకున్నా నాకు అభ్యంతరం ఉండబోదు. ఆప్తబంధువుగా నీకీమాట చెబుతున్నాను.... అయితే రజని కన్నతండ్రిగా మరోమాట- నీ భార్యవిషయంలో మరో కొంతకాలం ఓపికపట్టు చేతనైతే. ఎందుకంటే కాలం తెచ్చేమార్పులు - వాట్ని నేను విశ్వసిస్తాను" అన్నాడు రామచంద్రరావు.

ఆ మాటలనుబట్టి అతడు ఎంత నిష్పక్షపాతో అర్థమైంది హేమంత్‌కు. ఆ వెంట ఆయనపై ఓ విధమైన గౌరవభావం పుట్టుకు వచ్చి "ప్రయత్నిస్తాను మామయ్యా" అనిమాత్రం అనగలిగాడు.

హేమంత్ నుండి వచ్చిన ఆమాత్రపు హామీకే ఉప్పొంగిపోయాడు రామచంద్రరావు. "నాకు తెలుసు హేమంత్, నీ దెంతో మంచి మనసు !.... క్రిందికి పద. కాఫీ తాగుదాం" అంటూ హేమంత్ చెయ్యి పట్టుకొని మెట్లుదిగాడు రామచంద్రరావు.

తీరా లోపలికి వచ్చి చూస్తే ముందు గదిలో కూర్చొని మరో యువకుడితో నవ్వుతూ మాట్లాడుతోంది రజని.

జరిగిపోయిన దుస్సంఘటనను ఎంతో తేలిగ్గా మరిచిపోయి హాయిగా నవ్వుతూ మరొ మగాడితో తృప్తిగా మాట్లాడటం చూశాక హేమంత్ మనసు ఉద్వేగపడింది. అది చూచాయగా గమనించిన రామచంద్రరావు,

"ఏమిటి హేమంత్ అలా చూస్తున్నావ్ ?.... రజని మాట్లాడుతున్నది ఎవరితోననా ?... అతడు మావాళ్ళ అబ్బాయే .... దగ్గిరలోనే పల్లెటూరు వాళ్ళది .... డిగ్రీ అయిపోయింది .... ఉద్యోగాన్వేషణలో ఉండి — ప్రస్తుతం ట్యూషన్లు చెప్పుకుంటున్నాడు. కాలక్షేపం కోసం .... అప్పుడప్పుడు మా యింటికి వచ్చి వెళ్తుంటాడు. పేరు ప్రసాద్ .... రా. పరిచయం చేస్తాను" అని అతణ్ణి పరిచయం చేశాడు హేమంత్‌కు.

( ఇంకా ఉంది )